సాక్షి
నంద్యాల
సోమవారం • 1 • జనవరి • 2024



0.8 టీఎంసీల నీటి నిల్వ

గూడూరు: సుంకేసుల రిజర్వాయర్‌లో ఆదివారం నాటికి 0.845 టీఎంసీల నీరు నిల్వ ఉంది. రిజర్వాయర్ నుంచి కేసీ కాల్వకు 159 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.



అమ్మవారికి పల్లకీ సేవ

శ్రీశైలంటెంపుల్: భ్రమరాంబామల్లికార్జున స్వామివార్లకు ఆదివారం పల్లకీ సేవ నిర్వహించారు. పల్లకీలో ఉత్సవమూర్తులను ఉంచి ఆలయ ప్రదక్షిణ చేశారు.



జన హితం.. జల సురక్షితం

నీటిని ఆదా చేయడం, గ్రామాల్లో స్వచ్ఛతకు రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రాధాన్యత ఇస్తోంది. వర్షపు నీటి వృథాను అరికట్టి, గ్రామాల్లో అపరిశుభ్రతను పారదోలేందుకు చర్యలు చేపట్టింది.

IIలో▸

నవ వసంతానికి సుస్వాగతం

- 2023కు వీడ్కోలు..
- 2024 సంవత్సర వేడుకల్లో యవత జోష్
- కేక్‌లు కట్ చేసి సంబరాలు



నంద్యాల(వ్యవసాయం): కొత్త ఆలోచనలు.. కొంగొత్త ఆశయాలు.. నిన్నటి అనుభవాలు.. రేపటికి గుణపాఠాలు.. వీటన్నింటినీ బేరీజు వేసుకుంటూ 2023కి వీడ్కోలు పలుకుతూ నూతన సంవత్సరానికి ఘన స్వాగతం పలికారు నంద్యాల జిల్లా ప్రజలు. నవోత్సాహంతో ఆదివారం అర్ధరాత్రి దాటిన తర్వాత నూతన సంవత్సరం 2024కు ఆహ్వానం పలికారు. కేకులు కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. 'హ్యాపీ న్యూ ఇయర్' అంటూ శుభాకాంక్షలు చెప్పుకున్నారు. గతం మనకు కొంత మంచిని కొంత చెడును మిగిల్చి ఉండొచ్చు. నూతనం అనే పదం కొత్త ధనంతో పాటు భవిష్యత్ దర్శనానికి మార్గదర్శనం కావాలి. పాత అనే పదం భవిష్యత్ అనే భవనానికి పునాదిగా మారాలి. పాత కొత్త కలయికలను నెమరు వేసుకుంటూ జీవితాన్ని ఆశావహ దృక్పథంతో నిర్మించుకోవటం మనిషి లక్షణం కావాలి. గడిచిన సంవత్సరంలో ఎంతో మందికి ఎన్నో మధుర జ్ఞాపకాలు ఉంటాయి. మరి కొందరికి చేదు అనుభవాలు కూడా ఉంటాయి. చేదు అనుభవాలను గురువుగా భావించి మధుర జ్ఞాపకాలను పాఠ్యాంశాలుగా అనుకుంటే కొత్త జీవితం ప్రగతి మార్గంలో పయనిస్తుంది. ప్రకృతే మనిషికి పెద్ద పాఠశాల. ఈ సత్యాన్ని ప్రతి మనిషి గ్రహించి తన జీవితాన్ని తాను సంస్కరించుకున్నట్లే ప్రకృతిని కూడా పరిరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉంది. అయితే ఆశకు తగిన కృషి కూడా ఉండాలి. ఆ కృషి సవ్య మార్గంలో నడిస్తే విజయకేతనం ఎగరవేయవచ్చు.



అమ్మకానికి సిద్ధంగా ఉన్న మిఠాయిలు

నూతనోత్సాహంతో..

2024 నూతన సంవత్సర వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు అంతటా ఏర్పాటు చేసుకన్నారు. నంద్యాల, ఆళ్లగడ్డ, ఆత్మకూరు, డోన్ తదితర ప్రాంతాల్లో భారీగా కేక్‌ల అమ్మకాలు జరిగాయి. ప్రధాన రోడ్లలో బేకరీల యాజమాన్యాలు ప్రత్యేక స్టాళ్లను ఏర్పాటు చేసి కేక్‌లను విక్రయించారు. అరకేజీ కేకు రూ.150, కేజీ కేకు రూ.350చొప్పున అమ్ముతున్నారు. మిఠాయిలను భారీ ఎత్తున అందుబాటులోకి తెచ్చారు. బొకేలు, పూల దండలు రూ.100 నుంచి రూ.వెయ్యి వరకు కూడా సిద్ధం చేశారు.

యువత చేతిలోనే దేశభవిష్యత్తు



యువతపైనే దేశ భవిష్యత్తు ఆధారపడి ఉంది. కాబట్టి జరిగేటువంటి పరిణామాలను దృష్టిలో పెట్టుకొని ఆలోచనాత్మక ధోరణితో దేశ సౌభాగ్యానికి మనమంతా పాటుపడదాం. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండి భవిష్యత్తును మంచి మార్గంలో ఎంచుకొని సమాజాభివృద్ధి తోడ్పడితే బాగుంటుంది. రైతులు సుఖసంతోషాలతో ఎల్లప్పుడు ఉన్నప్పుడే రాష్ట్రం, దేశాభివృద్ధి చెందుతుంది.

– డాక్టర్ దీవీహయగ్రీవాచార్యులు, టీటీడీ దేవస్థానం వ్యాఖ్యాత, నంద్యాల

జ్ఞానాభివృద్ధికి తోడ్పడాలి



ప్రస్తుతం సోషల్ మీడియాను జ్ఞానాభివృద్ధికి తోడ్పడే విధంగా ఉపయోగించుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ పత్రిక, పుస్తక పఠనా సక్తిని పొందించుకొని వర్తమాన సమాజాభివృద్ధికి తోడ్పడాలన్నారు. దర్శకులు తీసే సినిమాలు కూడా సమాజానికి ఉపయోగపడుతూ యువతను సన్మాన మార్గంలో నడిచేలా ఉండాలన్నారు. **– డాక్టర్ రవీంద్రనాథ్, అంతర్జాతీయ విశ్రాంత శాస్త్రవేత్త, నంద్యాల**

వాటర్‌గ్రిడ్ ట్రయల్ రన్ విజయవంతం

- జనవరి మొదటి వారంలో బేతంచెర్ల మండలానికి శుద్ధజలం



సుగాలిమెట్ట పంప్‌హౌస్‌కు చేరిన నీరు

డోన్/బేతంచెర్ల: కొన్ని దశాబ్దాలుగా తాగునీటి సమస్యను ఎదుర్కొంటున్న డోన్ నియోజకవర్గానికి త్వరలో నీటి కష్టాలు పరిష్కారం కానున్నాయి. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చొరవతో ప్రారంభమైన మెగా వాటర్‌గ్రిడ్ పనులు నియోజకవర్గంలో శరవేగంగా జరుగుతున్నాయి. రూ.350 కోట్లతో పాణ్యం మండలం గోరుకల్లు రిజర్వాయర్ నుంచి డోన్ నియోజకవర్గంలోని ప్యాపిలి, బేతంచెర్ల, డోన్ మండలాల పరిధిలోని గ్రామాల్లోని ఇంటింటికి నీరందించే ఈ బృహత్తర పథకం ప్రారంభోత్సవానికి ఆదివారం తొలిఅడుగు పడింది. రిజర్వాయర్ నుంచి సుగాలిమెట్ట వద్ద నిర్మించిన పంప్‌హౌస్‌లోకి నీటిని విజయవంతంగా పంపింగ్ చేశారు. ఇక్కడి నుంచి బేతంచెర్ల మండలం సిమెంట్ నగర్ వద్ద 10 ఎకరాల విస్తీర్ణంలో నిర్మించిన పంప్‌హౌస్‌కు జనవరి 2వ తేదీలోపు మంచినీరు వచ్చే అవకాశం ఉంది. ఇక్కడ ఫిల్టర్ బెడ్లో నీరు శుభ్రపరిచిన తర్వాత జనవరి 7, 8వ తేదీలలో మొదటి విడతగా బేతంచెర్ల మండల ప్రజలకు శుద్ధ జలాన్ని అందించేందుకు అధికారులు ఏర్పాట్లు సిద్ధం చేస్తున్నారు. ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి చొరవతో నియోజకవర్గానికి ఈ బృహత్తర పథకం మంజూరై అనతికాలంలోని ప్రజలకు శుద్ధజలం అందుతుండటం శుభపరిణామమని ఎంపీపీ రేగటి రాజశేఖర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ ఆదివారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు.

అందరికీ శుభాలు కలగాలి

నంద్యాల: నూతన సంవత్సరంలోకి అడుగిడుతున్న శుభ సందర్భాన్ని పురస్కరించుకొని జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి అంజాద్‌బాషా, జిల్లా మంత్రి, రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి, జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీశామూన్, మైనారిటీ సంక్షేమ అభివృద్ధి సలహాదారు హబీబుల్లా, నంద్యాల పార్లమెంట్ సభ్యులు పోచా బ్రహ్మానందరెడ్డి, జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి, జిల్లా ఎస్పీ రఘువీర్ రెడ్డి, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజా ప్రతినిధులందరూ ఆదివారం వేర్వేరు ప్రకటనల్లో జిల్లా ప్రజలకు 2024 నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. నూతన సంవత్సరంలో ప్రజలందరికీ సుఖ సంతోషాలను, ఆయురారోగ్యాలను అందించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటూ రాష్ట్ర ప్రభుత్వ సుపరిపాలనలో అమలవుతున్న సంక్షేమాభివృద్ధి ఫలాలను పొంది ప్రతి ఒక్కరూ అభివృద్ధి పథంలో పయనించాలని వారు ఆకాంక్షించారు. 2024 ఎన్నికల్లోనూ వైఎస్సార్‌సీపీ మరోసారి అధికారంలోకి వచ్చి మరింత మేలు చేస్తుందన్నారు.

రేపటి నుంచి పింఛన్ల పంపిణీ

నంద్యాల(న్యూటౌన్): జిల్లాలో జనవరి 2వ తేదీ నుంచి రూ.3వేలు పింఛన్ పంపిణీ చేస్తున్నట్లు డీఆర్‌డీఏ పీడీ శ్రీధర్‌రెడ్డి ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముందుగా జిల్లాలో ఆళ్లగడ్డ, డోన్, గడివేముల, కోవెలకుంట్ల, కొలిమిగుండ్ల, పాణ్యం, సంజామల మండలాల్లో పింఛన్ల పంపిణీ జరుగుతుందన్నారు. 2వ తేదీన జరిగే పింఛన్ల పంపిణీలో ఎమ్మెల్యేలు పాల్గొని వారి చేతుల మీదుగా పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. అన్ని గ్రామాల్లో వలంటీర్లు, గ్రామ సచివాలయ పింఛన్ సిబ్బంది, వెలుగు సీసీలు, ప్రజాప్రతినిధులు పింఛన్ల పంపిణీలో పాల్గొంటారన్నారు. ఈనెల 3వ తేదీన రాష్ట్ర వ్యాప్తంగా ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి రూ.3వేలు పింఛన్‌ను లాంఛనంగా ప్రారంభించడం జరుగుతుందన్నారు. ఈనెల 8వ తేదీ వరకు పింఛన్ల పంపిణీ పాటు పింఛన్ పెంపు వారోత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు.

మహానందీశ్వరుడికి ఏకాంతసేవ పూజలు

మహానంది: మహానందిలో కొలువైన శ్రీ కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వర స్వామి దంపతులకు ఆదివారం రాత్రి ఏకాంతసేవ పూజలు నిర్వహించారు. వేద పండితులు రవిశంకర అవధాని ఆధ్వర్యంలో స్థానిక యాగశాలలో గణపతి పూజ, పుణ్యాహవాచనం, అలంకార పూజలు, ఏకాంత సేవ పూజలను శాస్త్రోక్తంగా చేపట్టారు. పూజల అనంతరం భక్తులకు స్వామి, అమ్మవారి ప్రసాదాలను పంపిణీ చేశారు.

వైభవంగా శేర్తి పూజ



మాలోల లక్ష్మీనరసింహ స్వామికి పూజలు నిర్వహిస్తున్న పీఠాధిపతి

ఆళ్లగడ్డ: అహోబిలం లక్ష్మీనరసింహ స్వామి దేవస్థానం పరిధిలోని శ్రీ మాలోల లక్ష్మీనరసింహ స్వామి సన్నిధిలో ఆదివారం శేర్తి పూజ వైభవంగా నిర్వహించారు. అహోబిల మఠం 46వ పీఠాధిపతి శ్రీ రంగరాజ యతీంద్ర మహాదేశికన్ ఉదయం భవనాశి నదిలో పుణ్యస్నానం ఆచరించి సుప్రభాత సేవతో స్వామిని మేలుకొలిపి గద్య త్రయం విన్నవిస్తూ స్వామిని ఆరాధించారు. అనంతరం పీఠాధిపతి నిత్యం ఆరాధించే ఉత్సవ మూర్తిని మూలమూర్తితో ఉంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం శాత్తుమొరయి గోష్ఠి కార్యక్రమాలను నిర్వహించి కార్యక్రమాన్ని ముగించారు. కార్యక్రమంలో ప్రధానార్చకులు కిడాంబీ వేణుగోపాలన్, మణియార్ సొమ్యానారాయణ్‌లు పాల్గొన్నారు.

వెండి కవచాల బహూకరణ



పీఠాధిపతి సుబుదేంద్ర తీర్థులకు వెండి కవచాలను అందజేస్తున్న దాత

మంత్రాలయం: కర్ణాటకలోని మైసూర్‌కు చెందిన గుండాచార్ అనే భక్తుడు రాఘవేంద్రుల మూల బృందవనానికి వెండి కవచాలను బహూకరించారు. ఆదివారం శ్రీ మఠం పీఠాధిపతి సుబుదేంద్ర తీర్థులకు కవచ పలకాలను అందజేశారు. ఈ సందర్భంగా దాతలకు పీఠాధిపతి మంత్రాక్షితలు అందజేసి ఆశీర్వదించారు.

కొండచిలువ హల్‌చల్


కొండ ప్రాంతంలో కొండచిలువను వదిలేసిన దృశ్యం

పాణ్యం: బలపనూరు గ్రామంలో హరిజనవాడలోకి ఆదివారం కొండచిలువ రావడంతో స్థానికులు భయాందోళన చెందారు. సమాచారం అందుకున్న నంద్యాల రెస్క్యూటీమ్ సభ్యులు కొండచిలువను పట్టుకొని సుగాలిమెట్ట కొండలో వదలినట్లు పాణ్యం అటవీశాఖ డిప్యూటీ రేంజ్ అధికారి చంద్రహాస్ ఆదివారం తెలిపారు.

జన హితం.. జల సురక్షితం

- ప్రభుత్వ భవనాల వద్ద 114 రెయిన్ వాటర్ హార్వెస్టింగ్‌లు
- జగనన్న కాలనీల్లో 2,154 ఇంకుడు గుంతలు
- జిల్లా వ్యాప్తంగా నిధుల మంజూరు


జూపాడుబంగ్లా మండలం తంగడంచ సచివాలయం వద్ద ఏర్పాటు చేసిన రెయిన్ వాటర్ హార్వెస్టింగ్ నిర్మాణం

నంద్యాల(సెంట్రల్): నీటిని ఆదా చేయడంతో పాటు గ్రామాల్లో స్వచ్ఛతకు రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోంది. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి వినూత్న కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో చేపడుతోంది. ఈ నేపథ్యంలో ప్రకృతి వనరులను కాపాడుకుంటూ భవిష్యత్ జీవనానికి మార్గాలు రూపొందిస్తోంది. అందులో భాగంగా జిల్లా వ్యాప్తంగా వర్షపునీటి వృథాను అరికట్టి, గ్రామాల్లో అపరిశుభ్రతను పారదోలేందుకు చర్యలు చేపట్టింది. ప్రస్తుతం జిల్లాలో అన్ని గ్రామ సచివాలయాలు ప్రభుత్వ భవన సముదాయాలతో కళకళలాడుతున్నాయి. ప్రతిరోజూ పదుల సంఖ్యలో ప్రజలు కార్యాలయాలకు వస్తున్నారు. వారికి అవగాహన కల్పించటంతో పాటు ఇక్కడ వర్షపు నీటిని పొదుపు చేసి విధానానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. రూఫ్ వాటర్ హార్వెస్టింగ్ స్ట్రక్చర్లను సచివాలయాల సముదాయాల వద్ద నిర్మిస్తోంది. జిల్లా వ్యాప్తంగా ఎన్ఆర్ఈజీఎస్ ద్వారా ఇటీవలే 114 స్ట్రక్చర్లు మంజూరు కాగా, ఇప్పటివరకు 24 స్ట్రక్చర్లను పూర్తి చేశారు. ఇవి పెద్ద తరహా ఇంకుడుగుంతల మాదిరిగా ఉంటాయి. సచివాలయ భవన సముదాయాల వర్షపునీరు నేరుగా ఈ నిర్మాణాల్లోకి చేరుతుంది. వీటి నిర్మాణానికి ఒక్కోదానికి రూ.64 వేల నిధులు ఎన్ఆర్ఈజీఎస్ కేటాయించింది.

2,154 ఇంకుడు గుంతలు..

జిల్లా వ్యాప్తంగా జగనన్న కాలనీల నిర్మాణం చకచకా జరుగుతోంది. వీటి నిర్మాణంతో కొత్తగా గ్రామాలే ఏర్పడుతున్నాయి. ఈ కాలనీల్లో ప్రజలకు అవగాహన కల్పిస్తూ ప్రతి ఇంటి వద్ద ఇంకుడు గుంతల నిర్మాణాన్ని ప్రభుత్వం చేపడుతోంది. ఈ గుంతల నిర్మాణానికి లబ్ధిదారుకు రూ.6 వేలు చెల్లిస్తున్నారు. వర్షపునీటితో పాటు వాడుక నీరు ఇందులోకి వెళ్లడం ద్వారా నీటి ఆదా జరగనుండడంతో పాటు, మురుగునీటి సమస్య గట్టెక్కనుంది.

ప్రతి గ్రామంలో సోక్‌పిట్..

జిల్లా వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో మురుగు సమస్య ఎక్కువవుతోంది. ఆయా గ్రామాల్లో మురుగు కాలువల ద్వారా వచ్చే నీరు శివారు ప్రాంతాల్లోని పంట పొలాలు, చెరువుల్లో చేరి పరిసరాలు కలుషితమవుతున్నాయి. ఈ సమస్యను పరిష్కరించేందుకు ఆయా గ్రామాల్లో కమ్యూనిటీ సోక్ పిట్ల నిర్మాణానికి పలు గ్రామాలను ప్రభుత్వం గుర్తించింది. జిల్లాలోని 29 గ్రామాల్లో వీటిని నిర్మించేందుకు అధికారులు ప్రతిపాదనలు తయారుచేయగా, ఒక్కో గ్రామానికి రూ.58 వేల నిధులు ప్రభుత్వం మంజూరు చేసింది. వీటి నిర్మాణంతో ఆయా గ్రామాల మురుగు నీరు ఈ పిట్లలోకి చేరి, గ్రామాల్లో పరిశుభ్రత కనిపించనుంది.

నిధులు మంజూరు



జిల్లాలో రూఫ్‌వాటర్ హార్వెస్టింగ్ స్ట్రక్చర్లు, ఇంకుడు గుంతలు, సోక్ పిట్ల నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయి. ఈ మేరకు పలు మండలాల్లో ఫీల్డ్ అసిస్టెంట్లకు, గ్రామ సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు అవగాహన కల్పించాం. ఆయా గ్రామాల్లో సచివాలయాల వద్ద హార్వెస్టింగ్ స్ట్రక్చర్లు, జగనన్న కాలనీల్లో ఇంకుడు గుంతల నిర్మాణం ప్రారంభమైంది. – **రామచంద్రారెడ్డి, సంచాలకులు, జిల్లా నీటి యాజమాన్య సంస్థ**

క్లుప్తంగా

భారీగా కర్ణాటక మద్యం స్వాధీనం


బొలెరో వాహనాన్ని పరిశీలిస్తున్న సీఐ సురేష్‌కుమార్ రెడ్డి

కృష్ణగిరి: బొలెరో వాహనం ట్రాలీకి ప్రత్యేక అర తయారుచేయించి సినీ ఫక్కీలో ఎవ్వరికీ అనుమానం రాకుండా గుట్టుగా కర్ణాటక మద్యం తరలిస్తున్న సంఘటన ఆదివారం వెలుగుచూసింది. కృష్ణగిరి మండలం నుంచి బాపనదొడ్డికి వెళ్లే రహదారిలో క్రాస్ వద్ద శనివారం రాత్రి ఓ కర్ణాటక రిజిస్ట్రేషన్ కలిగిన బొలెరో (అశోక్ లైలాండ్) వాహనం బోల్తా పడింది. అతివేగంగా బోల్తా పడడంతో వాహనం రెండు ముక్కలైంది. డ్రైవర్ అక్కడి నుంచి జారుకున్నాడు. ఆ దారిలో వెళ్లిన ద్విచక్ర వాహనదారులు పోలీస్‌స్టేషన్‌కు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని జేసీబీ సాయంతో వాహనాన్ని స్టేషన్‌కు తరలించారు. ఉదయం అయినా వాహనానికి సంబంధించి ఎవ్వరూ రాకపోవడంతో ట్రాలీ ఎత్తుగా ఉండటాన్ని గమనించారు. ట్రాలీకి ఏర్పాటు చేసిన క్యాబిన్‌ను కట్టర్‌తో తొలగించగా అందులో ప్రత్యేకంగా తయారు చేయించిన అరలో 70 బాక్సుల కర్ణాటక మద్యం కనిపించింది. సీఐ సురేష్‌కుమార్‌రెడ్డి, ఎస్‌ఐ సురేష్ మద్యాన్ని స్వాధీనం చేసుకుని విచారణ చేపట్టారు.

వెదురు కర్రల పట్టివేత

పాణ్యం : మండల కేంద్రంలోని జాతీయ రహదారిపై ఎలాంటి అనుమతి లేకుండా వెదురు కర్రల లోడ్‌తో వెళ్తున్న రెండు బొలెరో వాహనాలను సీజ్ చేసినట్లు పాణ్యం అటవీశాఖ డిప్యూటీ రేంజర్ చంద్రహాస్ ఆదివారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ విశ్వసనీయ సమాచారం మేరకు జాతీయ రహదారిపై తనిఖీ చేస్తుండగా రెండు వాహనాల్లో వెదురు కర్రలు, బూజు కర్రలు, బడేలు, ముల్లకర్రలు ఇతర కర్రలు ఉండటంతో స్వాధీనం చేసుకొని స్థానిక పోలీసు స్టేషన్‌లో ఉంచామన్నారు. తనిఖీలో గోరుకల్లు బీట్ అధికారి అబ్దుల్‌కలాం, రామతీర్థం బీట్ అధికారి మహేష్ పాల్గొన్నారు.


వెదురు కర్రలను సీజ్‌చేసిన అటవీశాఖ అధికారులు

కృష్ణనందీశ్వరుడి సన్నిధిలో జేసీ


పూజలు చేస్తున్న జేసీ దంపతులు

మహానంది: బండిఆత్మకూరు మండలంలోని నవనందుల్లో ఒకటైన శ్రీ కృష్ణనంది క్షేత్రంలో నంద్యాల జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి ఆదివారం పూజలు నిర్వహించారు. వారికి ఆలయ అర్చకులు మనోహరశర్మ, వెంగళరెడ్డిపేట సోమశేఖర్ రెడ్డి తదితరులు స్వాగతం పలికారు. జేసీ దంపతులు శ్రీ కృష్ణనందీశ్వరస్వామి వారిని దర్శించుకుని అభిషేకం, కుంకుమార్చన పూజలు చేపట్టారు. అనంతరం జేసీ తెలుగుగంగ కాల్వను పరిశీలించారు.

15 రోజుల్లోనే చోరీ సొత్తు రికవరీ


రికవరీ చేసిన బంగారు, వెండి ఆభరణాలను చూపుతున్న డీఎస్పీ శ్రీనివాసరావు

నందికొట్కూరు: మిడుతూరు మండలం పీర్ సాహెబ్ పేట గ్రామంలో రెడ్డి వారి గోపాలమ్మ ఇంట్లో చోరీకి గురైన సొత్తును పోలీసులు 15 రోజుల్లోనే రికవరీ చేశారు. వివరాలను డీఎస్పీ శ్రీనివాసరావు ఆదివారం విలేకరుల సమావేశంలో వెల్లడించారు. గోపాలమ్మ డిసెంబర్ 8వ తేదీ హైదరాబాద్‌లో ఉన్న కుమారుడు లక్ష్మీకాంతరెడ్డి వద్దకు వెళ్లారు. డిసెంబరు 19న తిరిగి వచ్చి చూసేసరికి ఇంటి తలుపులు తెరిచి ఉండడంతో చోరీ జరిగిందని గుర్తించి పోలీసులను ఆశ్రయించారు. మిడుతూరు మండలం రోళ్లపాడు టర్నింగ్ వద్ద ఆత్మకూరు పట్టణానికి చెందిన షేక్ ఖాదర్‌బాషా, పాములపాడు మండలం ఇస్కాల గ్రామానికి చెందిన మిద్దెల శ్రీనివాసులు, పాములపాడు మండల కేంద్రానికి చెందిన బోయ హరిప్రసాద్ అనుమానాస్పందంగా తిరుగుతుండగా పోలీసులు అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు. ముగ్గురు పీర్‌సాహెబ్ పేటలో చోరీకి పాల్పడినట్లు విచారణలో తేలింది. ముగ్గురి నుంచి 16.4 తులాల బంగారు అభరణాలులు, 124 తులాల వెండి వస్తువులు, ఒక సోని టీవీ, హీరో సూపర్ స్ప్లెండర్ మోటార్ సైకిల్‌ను స్వాధీనం చేసుకునట్లు వెల్లడించారు. వీటి విలువ సుమారు రూ.9.. 50లక్షలు ఉంటుందని చెప్పారు. ఈ చోరీతో పాటు జూపాడుబంగ్లా, వెలుగోడు, కోడుమూరు పోలీసు స్టేషన్ల పరిధిలో కూడా కొన్ని చోరీలకు పాల్పడినట్లు నిందితులు అంగీకరించినట్లు డీఎస్పీ తెలిపారు. కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరచనున్నట్లు వెల్లడించారు. కేసును ఛేదించిన రూరల్ సీఐ విజయభాస్కర్, ఎస్‌ఐ జగన్‌మోహన్, పోలీసులను డీఎస్పీ అభినందించి రివార్డులు అందజేశారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఎక్కడికైనా ఊరు వెళ్లితే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు.

మార్కెట్ ధరకే కందుల కొనుగోలు

- డీసీఎంఎస్ మార్కెట్ యార్డు బ్రాంచ్ మేనేజర్ రాజీవ్

కర్నూలు(అగ్రికల్చర్): జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ కర్నూలు బ్రాంచ్‌లో మార్కెట్ ధరకే రైతుల నుంచి కందులను కొనుగోలు చేస్తున్నట్లు ఆ బ్రాంచ్ మేనేజర్ బి.రాజీవ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందుకు రైతులు ముందుగా పేర్లు నమోదు చేయించుకోవాలని సూచించారు. ఎఫ్ఏక్యూ నిబంధనల ప్రకారం నాణ్యతా ప్రమాణాలు ఉండాలని తెలిపారు. కర్నూలు, కల్లూరు, గూడూరు మండలాల రైతులకు సంబంధించి కర్నూలు వ్యవసాయ మార్కెట్ యార్డులోని డీసీఎంఎస్ బ్రాంచ్‌లో కొనుగోలు చేస్తామని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 9381085983 ఫోన్ చేసి సంప్రదించవచ్చని తెలిపారు.

కలియుగ దానకర్ణుడు బుడ్డా వెంగళరెడ్డి


బుడ్డా వెంగళరెడ్డి చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

కోవెలకుంట్ల: డొక్కల కరువు సమయంలో ప్రజల ఆకలి తీర్చిన ఉయ్యాలవాడకు చెందిన బుడ్డా వెంగళరెడ్డి కలియుగ దానకర్ణుడిగా కీర్తింపబడుతున్నారని వక్తలు కొనియాడారు. ఆదివారం పట్టణంలో ప్రకృతి పీఠం ఆధ్వర్యంలో వెంగళరెడ్డి 123 వర్ధంతిని నిర్వహించారు. ముందుగా బుడ్డా వెంగళరెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో రిటైర్డ్ లైబ్రేరియన్ పల్లె నరసింహారెడ్డి, రిటైర్డ్ హెచ్‌ఎం నారాయణస్వామి మాట్లాడుతూ 1860లో రాయలసీమలో సంభవించిన డొక్కల కరువు బీభత్సాన్ని గమనించిన బుడ్డావెంగళరెడ్డి గంజి కేంద్రాలను ప్రారంభించి తన వద్ద ఉన్న ధాన్యంతో మూడేళ్లపాటు ప్రజల ఆకలి తీర్చారన్నారు. బుడ్డా వెంగళరెడ్డి దానగుణం తెలుసుకున్న ఇంగ్లాండ్ రాణి విక్టోరియా మహారాణి ఢిల్లీ పిలిపించి సత్కరించారన్నారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు లింగన్న, అప్పపోగు వెంకట సుబ్బయ్య, రవితేజారెడ్డి, సీతారామయ్య, ఓబులేసు, మల్లికార్జున, శేఖర్, సుబ్బయ్య, తదితరులు పాల్గొన్నారు.

సుందరీకరణ పనులు త్వరగా పూర్తి చేయాలి

- ఎథిక్స్ కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి
- మహానందిలో అభివృద్ధి పనుల పరిశీలన


పనుల నాణ్యతను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి

మహానంది: మహానందిలో జరుగుతున్న సుందరీకరణ, అభివృద్ధి పనులను వేగవంతంగా, నాణ్యతగా పూర్తి చేయాలని ఎథిక్స్ కమిటీ చైర్మన్, శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి సూచించారు. మహానందిలో జరుగుతున్న అభివృద్ధి పనులను ఆదివారం చైర్మన్ కొమ్మా మహేశ్వరరెడ్డి, ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డిలతో కలిసి పరిశీలించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ మహానంది ఆలయ ప్రాంగణాలను మరింత సుందరంగా తీర్చిదిద్దేందుకు తన వంతుగా రూ. రెండు కోట్లకు పైగా సొంత డబ్బులు వెచ్చిస్తున్నట్లు చెప్పారు. పనుల్లో నాణ్యత లోపిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మహానందిని మోడల్ టెంపుల్‌గా రూపుదిద్దుతామన్నారు. మహానందీశ్వరస్వామి దర్శనార్థం వచ్చిన భక్తులు రెండ్రోజులు ఇక్కడే ఉందామనేంత ఆహ్లాదంగా తీర్చిదిద్దుతున్నామని చెప్పారు. అలాగే భక్తుల సౌకర్యార్థం వసతిగృహాల నిర్మాణాలకు ప్రణాళికలు పూర్తి చేశామన్నారు. పనుల్లో నాణ్యత లోపించకుండా చూసుకోవాలని ఇంజనీరింగ్, ఆర్కిటెక్చర్ నిపుణులకు సూచించారు. వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సీనియర్ నేత శిల్పా భువనేశ్వరరెడ్డి, ధర్మకర్త గంగిశెట్టి మల్లికార్జునరావు, నేతలు గజ్జా పెద్ద పక్కీరయ్య, కుంచపు శ్రీనివాసులు, భూమా సుబ్బరామయ్య, ఏఈ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఉరుసు

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని టెక్కెలో వెలసిన హజరత్ సయ్యద్‌షా నూరుల్లా సాహెబ్ దర్గా ఉరుసును మతసామరస్యానికి ప్రతీకగా ఆదివారం ఘనంగా నిర్వహించారు. స్వామి వారికి సాయంత్రం ప్రత్యేక ఫాతెహాలు సమర్పించారు. నిర్వాహకులు సయ్యద్ అఫీజ్ అహమ్మద్ ఖాద్రి చాదర్‌ను సమర్పించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం పేదలకు అన్నదానం చేపట్టారు.

వస్త్రాలు, మందుల పంపిణీ

నంద్యాల(వ్యవసాయం): నూతన సంవత్సరం సందర్భంగా పరివర్తన లైఫ్ సెంటర్‌లో హెచ్ఐవీ బాధితులకు వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు దాల్‌మిల్ అమీర్ ఆధ్వర్యంలో ఆదివారం వస్త్రాలు, మందులు పంపిణీ చేశారు. వైఎస్సార్‌సీపీ జిల్లా లీగల్‌సెల్ అధ్యక్షుడు రామసుబ్బయ్య, నాయకులు ప్రతాపరెడ్డి, బబ్బూరి కృష్ణారావు, కడియం బాబు పాల్గొన్నారు.

చర్చీల్లో ప్రత్యేక ప్రార్థనలు

నంద్యాల(న్యూటౌన్): పట్టణంలోని పలు చర్చీల్లో ఆదివారం అర్ధరాత్రి నుంచి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తున్నట్లు హోలీక్రాస్ కెథడ్రల్ పాస్టరేట్-1(పెద్దచర్చి) ఆలయ డీనరీ చైర్మన్ జోసెఫ్, పాస్టరేట్-2 ఆల్‌సెయింట్ చర్చి డీనరీ చైర్మన్ ఇమ్మానియేల్ గురువులు తెలిపారు. వారు మాట్లాడుతూ న్యూఇయర్ వేడుకల్లో భాగంగా ప్రత్యేక ప్రార్థనలు ఉంటాయన్నారు. అంతేగాకుండా క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకొని శిశువుకు నామకరణం చేసే రోజుగా ఆనవాయితీ ప్రకారం 1వ తేదీన పలు ఆలయాల్లో దైవ సందేశం ఇస్తామని చెప్పారు.

వ్యవసాయ విద్యుత్ వేళలు

ఉయ్యాలవాడ : మండలంలోని రైతులకు పగటిపూట 7 గంటలు ఉచిత విద్యుత్ సరఫరా చేస్తున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ గురప్ప తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ సోమవారం నుంచి వారం పాటు కొండుపల్లె, ఇంజేడు, అక్కంపల్లె, హరివరం, ఎస్.కొత్తపల్లె ఫీడర్ల పరిధిలోని గ్రామాలకు ఉదయం 8 నుంచి సాయంత్రం 3 గంటల వరకు, మాయలూరు, సుద్దమల్ల ఫీడర్ల కిందనున్న గ్రామాలకు ఉదయం 11 నుంచి సాయంత్రం 6 గంటల వరకు త్రీఫేస్ విద్యుత్ సరఫరా చేస్తామని ఏఈ వివరించారు.

సమస్యలు పరిష్కరించాలి

నంద్యాల(న్యూటౌన్): మున్సిపల్ వర్కర్ల సమస్యలను పరిష్కరించాలని ఏఐటీయూసీ నాయకుడు శ్రీనివాసులు కోరారు. ఆదివారం పట్టణంలోని శ్రీనివాససెంటర్‌లో ధర్నా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కార్మికులకు వేతనాలు పెంచాలని, ప్రభుత్వ పథకాలు వర్తింపజేయాలని, అర్హులకు ఇళ్ల స్థలాలు ఇచ్చి పక్కా గృహాలు నిర్మించి ఇవ్వాలని కోరారు. మున్సిపల్ వర్కర్స్ యూనియన్ కార్యదర్శి ప్రతాప్, అధ్యక్షుడు రంజిత్, మస్తానయ్య, శివరాముడు పాల్గొన్నారు.

జాతీయస్థాయి రెజ్లింగ్ పోటీల్లో ప్రతిభ

చాగలమర్రి: బీచ్ గ్రాప్లింగ్ చాంపియన్‌షిప్-2023 జాతీయ స్థాయి పోటీలు విశాఖపట్టణంలోని రామకృష్ణా బీచ్‌లో ఈనెల 28,29,30 తేదీల్లో నిర్వహించారు. 58 కేజీల విభాగంలో మండలంలోని మూడురాళ్లపల్లె గ్రామానికి చెందిన టి.నరసింహ పవన్ రెడ్డి 2వ స్థానాన్ని కైవసం చేసుకొని సిల్వర్ మెడల్ సాధించాడు. మొదటి రౌండ్‌లో జార్ఖండ్‌కు చెందిన రెజ్లర్, రెండో రౌండ్‌లో ఒడిశాకు చెందిన రెజ్లర్‌పై గెలుపొందాడు. మూడవ రౌండ్‌లో రాజస్థాన్ రెజ్లర్ చేతిలో ఓటమి చెంది రెండవ స్థానంలో నిలిచాడు. రాజంపేటలోని అన్నమయ్య కళాశాలలో బీటెక్ ఫైనలియర్ చదువుతున్న టి.నరసింహ పవన్ రెడ్డి 2022లో వైజాగ్‌లోని మధురవాడ, రైల్వే కోడూరులో నిర్వహించిన రాష్ట్రస్థాయి రెజ్లింగ్ పోటీల్లో బంగారు పతకం సాధించాడు.



విశాఖపట్టణంలో మెడల్‌ను స్వీకరిస్తున్న టి.నరసింహ పవన్ రెడ్డి

రేపటి నుంచి జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు

శిరివెళ్ల: ఈ నెల 2వ తేదీ నుంచి మండలంలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలను నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం ఆదివారం తెలిపారు. 2న చెన్నూరు గ్రామ సచివాలయ పరిధిలోని ప్రాథమికోన్నత పాఠశాల, 12న బోయలకుంట్ల, 19న గుంప్రమాన్‌దిన్నెలో శిబిరాలు జరుగుతాయన్నారు. 23న శిరివెళ్ల 3వ సచివాలయం, 30న గోవిందపల్లె 2 సచివాలయం, ఫిబ్రవరి 9న గుండంపాడు, 16న యర్రగుంట్ల 1వ సచివాలయంలో శిబిరాలు నిర్వహిస్తామని చెప్పారు. 23న గంగవరం, మార్చి 1న జీనేపల్లె, 5న గోవిందపల్లె 1వ సచివాలయం, 12న శిరివెళ్ల 2వ సచివాలయం, 22న మహదేవపురం, 26న శిరివెళ్ల 4వ సచివాలయం, ఏప్రిల్ 2న కోటపాడులో వైద్య శిబిరాలు జరుగుతాయని వివరించారు.

ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు

నంద్యాల: నియోజకవర్గ ప్రజలకు ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఆదివారం ఎమ్మెల్యే మాట్లాడుతూ 2024లో అందరికీ మేలు జరగాలని, సుఖశాంతులతో జీవించాలని ఆకాంక్షించారు. నూతన సంవత్సరం సందర్భంగా పార్టీ నాయకులకు, కార్యకర్తలకు అధికారులకు, ప్రజలందరికీ అందుబాటులో ఉంటానని చెప్పారు. శుభాకాంక్షలు తెలిపేందుకు వచ్చే వారు పూలదండులు, బొకేలు కాకుండా విద్యార్థులకు ఉపయోగపడే పెన్నులు, నోట్ పుస్తకాలతో రావాలని కోరారు.


ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి

క్యాలెండర్ ఆవిష్కరణ


క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న నౌమన్

నంద్యాల(న్యూటౌన్): పట్టణంలోని ఏపీ ఉర్దూ టీచర్స్ అసోసియేషన్ నూతన క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఉర్దూ అకాడమీ మాజీ చైర్మన్ డాక్టర్ నౌమాన్ హాజరయ్యారు. ఆదివారం జరిగిన కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా అధ్యక్షురాలు షమీమ్‌బాను, ప్రధాన కార్యదర్శి అంజాద్‌షరీఫ్, అసోసియేషన్ రాష్ట్ర కన్వీనర్ అబ్దుల్‌అజీజ్, దంత వైద్యులు మురళీధర్‌రెడ్డి పాల్గొన్నారు. మున్సిపల్ కో ఆప్షన్ సభ్యుడు సయ్యద్ సలాముల్లా, కౌన్సిలర్ మహమ్మద్ తమీమ్, నూర్ అహమ్మద్ మదానీ పాల్గొన్నారు.

కొనసాగుతున్న తిరుప్పావై ప్రవచనాలు

నంద్యాల(వ్యవసాయం): స్థానిక సంజీవనగర్ రామాలయంలో ధనుర్మాసాన్ని పురస్కరించుకొని ఆదివారం 15వ రోజు పాశురాన్ని టీటీడీ బ్రహ్మోత్సవాల వ్యాఖ్యాత డాక్టర్ డీవీ హయగ్రీవాచారి భక్తులకు వివరించారు. టీటీడీ దివ్యప్రబంధ ప్రాజెక్టు, నంది రైతు సమాఖ్య, భగవత్ సేవా సమాజ్ ఆధ్వర్యంలో నిర్వహించే తిరుప్పావై పాశురాలు ఆకట్టుకున్నాయి. గోదాదేవి గోపికలను నిద్ర నుంచి లేపే విధానం, సంభాషణాలను వివరించారు.


ప్రవచనాలు వినిపిస్తున్న హయగ్రీవాచారి

పెద్దమ్మకు ప్రత్యేక పూజలు

దొర్నిపాడు: మండలంలోని డబ్ల్యూ గోవిందిన్నె గ్రామంలో వెలసిన మూలపెద్దమ్మ అమ్మవారికి ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. ఉదయమే అమ్మవారిని నూతన పట్టు వస్త్రాలతో అలంకరించి అభిషేకాలు, హారతులు పట్టారు. అమ్మవారిని భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు.

ఘనంగా పుస్తకావిష్కరణ

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని విశ్వనగర్‌లోని గాంధీ దేవాలయంలో సూరన సారస్వత సంఘం ఆధ్వర్యంలో విశ్వకర్మ విజయం పుస్తకావిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. పుస్తక రచయిత డాక్టర్ శ్రీదేవి మాట్లాడుతూ విశ్వకర్మ గురించి ప్రత్యేక కథనాలు, పద్యాలు, విశేషాలను పుస్తకంలో వివరించామని చెప్పారు. అనంతరం విశ్వకర్మ సంఘం నాయకులు ఆమెను ఘనంగా సత్కరించారు. డాక్టర్ సహదేవుడు, డాక్టర్ విశ్వరూపాచారి,గౌరీశంకర్,డాక్టర్ రామేశ్వరరెడ్డి, డాక్టర్ భార్గవరెడ్డి, డాక్టర్ నాగార్జునరెడ్డి, మధుసూదన్‌శర్మ, విజయలక్ష్మి పాల్గొన్నారు.

బీమా తక్షణ సాయం అందజేత

ఉయ్యాలవాడ : మండల కేంద్రానికి చెందిన రిగోపుల శ్రీనివాసరెడ్డి అనారోగ్యంతో శనివారం నంద్యాల శాంతిరాం అసుపత్రిలో చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందాడు. ఆదివారం అంత్యక్రియలు ముగిశాయి. మృతుడు వైఎస్సార్ బీమాకు అర్హుడు కావడంతో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బుడ్డా చంద్రమోహన్ రెడ్డి బీమా తక్షణ సాయం కింద మృతుడి భార్య సుభద్రకు రూ.10వేలు అందజేశారు. పంచాయతీ కార్యదర్శి జయరామిరెడ్డి, సర్పంచ్ మేకల ఓబులేస్, వెల్ఫేర్ అసిస్టెంట్ ఉన్నారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

నంద్యాల(వ్యవసాయం): స్థానిక మున్సిపల్ టౌన్‌హాల్ వద్దనున్న ఆయూష్ యోగా కేంద్రంలో ఆదివారం సాయంత్రం యోగా సభ్యులు, చిన్నారులతో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. సమితి నిర్వాహకులు ఆనంద్ గురూజీ మాట్లాడుతూ నూతన సంవత్సరానికి స్వాగతం పలుకుతూ చిన్నారులతో పాటలు, భరత నాట్యం, కోలాటం, శ్లోకాలు, దేశభక్తి గీతాలు తదితర వాటిని నిర్వహించామన్నారు.

'మిల్లీ' సేవలను విస్తరించాలి

నంద్యాల(వ్యవసాయం): నంద్యాల జిల్లా మిల్లీ కౌన్సిల్ సేవలను విస్తరింపజేయాలని ఆలిండియా మిల్లీ కౌన్సిల్ రాష్ట్ర అధ్యక్షుడు మౌలానా ముఫ్తీ అబ్దుల్ ఖదీర్ నిజామీ తెలిపారు. స్థానిక కార్యాలయంలో ఆదివారం మిల్లీ కౌన్సిల్ నంద్యాల జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా గౌస్, కార్యదర్శిగా సలీమ్ పర్వేజ్ ఎన్నికయ్యారు. జాతీయ కార్యదర్శి హజరత్ రిఫాయి జిలానీ, సహాయ కార్యదర్శి సులేమాన్‌ఖాన్ పాల్గొన్నారు.

రోడ్డు పనుల పరిశీలన

చాగలమర్రి: మండల పరిధిలోని ముత్యాలపాడు గ్రామ సచివాలయం-1 పరిధిలోని చక్రవర్తుల పల్లె, ఎం.తండా, ముత్యాలపాడు గ్రామాల్లో రూ.40 లక్షలతో చేపట్టిన డ్రైనేజీ, సీసీ రోడ్ల నిర్మాణ పనులను సాగునీటి సంఘం అధ్యక్షుడు, వైఎస్సార్‌సీపీ మండల కార్యదర్శి శేషు రమేష్ ఆదివారం పరిశీలించారు.ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామంలో అభివృద్ధి పనులు జోరుగా సాగుతున్నాయని, ముఖ్యంగా సీసీ రోడ్లు, డ్రైనేజీలు, వీధి స్తంభాలు, మంచి నీటి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు చెప్పారు. ఇప్పటికే కొన్ని పూర్తి కాగా మరికొన్నింటి పనులు సాగుతున్నాయన్నారు.